
కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
ప్రజల గళం...
ఆదివారం • 19-04-2026
పేజీలు: 3

360° SINGLE TOPIC

మ్యారేజ్ ప్రాబ్లమ్స్

# అయ్యో అబ్బాయ్..
# లేదయ్ జోడీ!

**రాష్ట్రంలో పెళ్లికాని యువకులెందరో..**
**ఏజ్ బార్ అవుతున్నా దొరకని అమ్మాయిలు**
**ఓసీ, బీసీ సామాజిక వర్గాల్లో సమస్య తీవ్రం**
**ఇతర కులాల పిల్లలనూ చేసుకునేందుకు రెడీ**



ఏఐ ఇమేజ్

'పెళ్లెప్పుడవుతుంది బాబూ.. పిల్ల ఏడ దొరుకుతుంది బాబూ'.. ఇదీ తెలుగు సినిమాలోని పాట. ఇప్పుడు తెలంగాణలోని యువకులూ ఇదే పాట పాడుకోవాల్సి వస్తున్నది. అబ్బాయిలు పెళ్లికి రెడీ అయినప్పటికీ, అమ్మాయిలు దొరకడం లేదు. ఏండ్లకేండ్లు అమ్మాయిల కోసం ఎదురుచూసి అబ్బాయిలు చివరికి ఏజ్ బార్ అయిపోతున్నారు. ముదురు బ్యాచిలర్స్‌గానే మిగిలిపోతున్నారు.

రాష్ట్రంలో కొన్ని సామాజికవర్గాల్లో పిల్లలు దొరకడం మరీ కష్టంగా మారింది. ఓసీ, బీసీల్లో సమస్య తీవ్రంగా ఉన్నది. ఓసీల్లో బ్రాహ్మణ, కమ్మ, కాపు, రెడ్డి సామాజిక వర్గాల్లో.. బీసీల్లో యాదవులు, గౌడ్స్, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, మున్నూరు కాపు సామాజిక వర్గాల్లో సిచువేషన్ ఆందోళనకరంగా ఉన్నది. అమ్మాయిలు దొరక్కపోవడంతో కులాలతో ప్రస్తావన లేకుండా ఎవరినైనా చేసుకుంటున్నారు.

తెలంగాణలో అమ్మాయిలకు సరిపడా అబ్బాయిలు లేరు. సమాజం ఎంత ముందుకెళ్తున్నా.. ఈ విషయంలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది మగవాళ్లకు 902 మంది ఆడవాళ్లు మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో వెయ్యి మంది బాలురు జన్మిస్తుంటే, 908 మంది బాలికలు మాత్రమే జన్మిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సమస్య మరింత తీవ్రమవుతుంది. అబ్బాయిలకు అమ్మాయిలు ఎందుకు దొరకడం లేదు? ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అమ్మాయిల సంఖ్య ఎందుకు పెరగడం లేదు? కొన్ని కులాల్లో అసలు అమ్మాయిలే దొరకని సిచువేషన్ ఎందుకొచ్చింది? అనే అంశాలపై కలం 360 డిగ్రీస్ స్పెషల్..

- సెంట్రల్ డెస్క్, కలం

kalamdaily.com
Follow on: Kalamtelugu

# 28 శాతం అన్‌మ్యారీడ్..

అమ్మాయిలు దొరక్కపోవడం, ఇతర కారణాల వల్ల చాలామంది అవివాహితులుగా మిగిలిపోతున్నారు. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే (2019-21) రిపోర్టు ప్రకారం.. తెలంగాణలో 20-49 ఏండ్ల వయసున్న మగవాళ్లలో వివాహం కానివారు దాదాపు 25-28 శాతం. 20-49 ఏండ్ల వయసున్న ఆడవాళ్లలో వివాహం కానివారు సుమారు 9-11 శాతం. అంటే ఆ సర్వే నాటికి ఉన్న లెక్కలివి. దీన్ని బట్టి చాలామంది మగవాళ్లకు అమ్మాయిలు దొరకడం లేదు.



ఏఐ ఇమేజ్

## ఎన్నో కారణాలు..

అబ్బాయిలకు అమ్మాయిలు దొరక్కపోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. అబ్బాయిల సంఖ్యకు తగ్గట్టు అమ్మాయిలు లేకపోవడం, మారిన సామాజిక పరిస్థితులు, తల్లిదండ్రులు, యువతుల్లో అవగాహన పెరగడం, అబ్బాయిలకు సరైన జాబ్ లేకపోవడం, ఆస్తిపాస్తులు వంటి కారణాలెన్నో ఉన్నాయి.

- **సెక్స్ రేషియో:** సెక్స్ రేషియోకు సంబంధించి తెలంగాణలో అసమానత ఎక్కువగా ఉంది. మగవాళ్ల సంఖ్యకు సమానంగా ఆడవాళ్లు లేరు. 2023 శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్)–2023 రిపోర్టు ప్రకారం.. రాష్ట్రంలో ఓవరాల్ సెక్స్ రేషియో 902. అంటే ప్రతి వెయ్యి మంది మగవాళ్లకు 902 మంది ఆడవాళ్లు మాత్రమే ఉన్నారు. ఓవరాల్ సెక్స్ రేషియోకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణనే చివరి స్థానంలో ఉంది. ఈ రేటు కేరళలో 962, ఆంధ్రప్రదేశ్‌లో 932, కర్నాటకలో 928, తమిళనాడులో 920. ఇక తెలంగాణలో బర్త్ సెక్స్ రేషియో 908గా ఉంది. అంటే రాష్ట్రంలో పుడుతున్న వెయ్యి మంది బాలురకు గాను 908 మంది బాలికలు మాత్రమే జన్మిస్తున్నారు. ఆడ, మగ సంఖ్యల్లో తేడాలు రూరల్, అర్బన్ ప్రాంతాలు, జిల్లాలు, కులాలను బట్టి మారుతూ ఉన్నది.
- **అవేర్‌నెస్ పెరగడం:** గతంతో పోలిస్తే అమ్మాయిలు, వాళ్ల తల్లిదండ్రుల్లో అవగాహన పెరిగింది. ఎవరో ఒక అబ్బాయిని చూసి, పెళ్లి చేసి పంపించేసి, ఆడపిల్ల బరువు దించుకోవాలని తల్లిదండ్రులు అనుకోవడం లేదు. అన్ని విధాలుగా సరైన అల్లుడి కోసం వెతుకుతున్నారు.
- పెళ్లి విషయంలో అమ్మాయిలు కూడా తొందరపడడం లేదు. ఉన్నత చదువులు చదవాలని, కెరీర్‌లో స్థిరపడాలని అనుకుంటున్నారు. తల్లిదండ్రులు చూసిన అబ్బాయిని గుడ్డిగా చేసుకోవడం లేదు. నచ్చిన వ్యక్తి దొరికే వరకు వెయిట్ చేస్తున్నారు.
- **జాబ్, ఆస్తిపాస్తులు:** లైఫ్‌లో సెటిల్ అయిన అబ్బాయిలకే పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. మంచి జాబ్, ఆస్తిపాస్తులు ఉన్న అబ్బాయిల కోసం అమ్మాయిల తల్లిదండ్రులు వెతుకుతున్నారు. ప్రైవేట్ జాబ్స్ చేస్తున్న వాళ్లకు మంచి జీతాలు వస్తున్నా.. అవి ఎప్పుడు పోతాయో తెలియదని, గవర్నమెంట్, సెక్యూరిటీ ఉన్న జాబ్స్, బిజినెస్ చేస్తున్న వాళ్ల కోసం చూస్తున్నారు.
- **లేట్ మ్యారేజ్:** కొందరు అబ్బాయిలు లైఫ్‌లో సెటిల్ కావడం కోసమంటూ ఏండ్లకేండ్లు వేచి చూస్తున్నారు. తీరా 35 ఏండ్లు వచ్చాక పెళ్లికి రెడీ అవుతున్నారు. కానీ ఆ ఏజ్‌లో పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకురావడం లేదు.

## మ్యాట్రిమోనీ రిజిస్ట్రేషన్లు వాళ్లవే ఎక్కువ..

ప్రముఖ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలోని రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే ఏయే కులాల్లో సమస్య ఎక్కువగా ఉందో అర్థమవుతున్నది. ఓసీ, బీసీ సామాజిక వర్గాల్లో సమస్య ఎక్కువగా ఉంది. ఈ సైట్లలో నమోదవుతున్న ప్రొఫైల్స్‌లో దాదాపు 65-70% అబ్బాయిలవే. సుమారు 30- 35% అమ్మాయిలవి ఉంటున్నాయి. అంటే చాలామంది అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడం లేదని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

- మ్యాట్రిమోనీ సైట్లలో ఓసీ సామాజిక వర్గాల రిజిస్ట్రేషన్లు ఎక్కువగా ఉంటున్నాయి. రెడ్డి, కమ్మ, కాపు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ వర్గాల నుంచి దాదాపు 40-50% రిజిస్ట్రేషన్లు ఉంటున్నాయి.
- ఓసీల తర్వాత సెకండ్ ప్లేస్‌లో బీసీలు ఉన్నారు. ఈ సామాజిక వర్గాలైన యాదవ, గౌడ, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, మున్నూరు కాపు వంటి వర్గాల నుంచి సుమారు 30-35% రిజిస్ట్రేషన్లు ఉంటున్నాయి.
- ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల నుంచి దాదాపు 15- 20% రిజస్ట్రేషన్లు ఉంటున్నాయి.



## కొన్ని కులాల్లో అస్సలు దొరకట్లే..

తెలంగాణలో కొన్ని కులాల్లో అయితే అమ్మాయిలు అస్సలు దొరకడం లేదు. ఓసీల్లో బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ, కాపు సామాజిక వర్గాల్లో సమస్య తీవ్రంగా ఉంది. బీసీల్లో యాదవ, గౌడ, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, మున్నూరు కాపు సామాజిక వర్గాల్లో ఇదే సిచువేషన్. అగ్రవర్ణాల్లో సమస్య తీవ్రంగా ఉండడంతో కులంతో సంబంధం లేకుండా అమ్మాయిలను చేసుకోవడానికి ముందుకొస్తున్నారు. కొంతమంది ఇతర రాష్ట్రాల అమ్మాయిలనూ చేసుకుంటున్నారు.



kalamdaily.com
Follow on: Kalamtelugu

# పెళ్లి కావట్లేదని ఆత్మహత్యలు..

**పెళ్లి కావట్లేదన్న మనస్తాపంతో కొంతమంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా రాష్ట్రంలో జరిగాయి.**

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఓ యువకుడు తనకు సరైన జోడీ కోసం కొన్నేండ్లు వెతికాడు. అయినా అమ్మాయి దొరకడం లేదని 2025 మే 8న ఆత్మహత్య చేసుకున్నాడు.
- శంషాబాద్‌కు చెందిన 32 ఏండ్ల ప్రైవేట్ ఎంప్లాయ్ కి పెళ్లి చేయాలని అమ్మానాన్నలు ఆరు నెలలు అమ్మాయి కోసం వెతికారు. కానీ పెళ్లి కుదరలేదు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు 2025 మే 21న సూసైడ్ చేసుకున్నాడు.
- హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాకు చెందిన ఓ యువకుడు టైలర్‌గా పని చేస్తున్నాడు. పెళ్లి కోసం ప్రయత్నించగా సరైన జోడీ దొరకలేదు. 30 ఏండ్లు వచ్చినా పెళ్లి కాలేదన్న మనస్తాపంతో 2021 అక్టోబర్ 8న ఉరేసుకున్నాడు.
- హైదరాబాద్‌కు చెందిన 39 ఏండ్ల యువకుడు గోల్డ్‌స్మిత్‌గా పని చేస్తున్నాడు. పెళ్లి కోసం ప్రయత్నించగా, అమ్మాయి దొరక్కపోవడంతో 2021 జులై 1న ఆత్మహత్య చేసుకున్నాడు.

